క్లుప్తంగా

భీమేశ్వరుని సన్నిధిలో ఎస్పీ దంపతులు



ఎస్పీ దంపతులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న పండితులు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయాన్ని సోమవారం సాయంత్రం ఎస్పీ విక్రాంత్ పాటిల్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఎస్పీ దంపతులకు ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఉప ఆలయాలు, మూలవిరాట్, స్వామివారిని, అమ్మవార్లను వారు దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పండితులు ఎస్పీ దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు. సీఐ ఎ.కృష్ణభగవాన్, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర కబడ్డీ జట్టుకు 'కోట' విద్యార్థి



పోటీలో సాధించిన బహుమతితో అవినాష్

సామర్లకోట: పట్టణానికి చెందిన విద్యార్థి సింగంపల్లి అవినాష్ రాష్ట్ర కబడ్డీ జట్టులో స్థానం సాధించాడు. ఈ నెల 6 నుంచి మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్టుకు ప్రాతినిధ్యం వహించి, అద్భుత ప్రతిభ కనబర్చాడు. ఈ వివరాలను ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ నూతలపాటి పూర్ణచంద్రరావు సోమవారం విలేకర్లకు తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన అవినాష్‌ను పలువురు అభినందించారు.


అదుపుతప్పి ఢీకొన్న బస్సులు



సామర్లకోట–కాకినాడ రోడ్డులో ఢీకొన్న బస్సులు

సామర్లకోట: ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, కార్పొరేట్ కళాశాల బస్సు స్థానిక కాకినాడ రోడ్డులో సోమవారం అదుపుతప్పి ఢీకొన్నాయి. దీంతో ఆ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మాధవపట్నం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. రోడ్డులో అడుగడుగునా గోతులు ఉండడంతో, వాటిని తప్పించే క్రమంలో ఈ బస్సులు ఢీకొన్నట్టు స్థానికులు తెలిపారు. చాలాసేపటి వరకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి.


అలరించిన జ్యోతిర్లింగార్చన



పంచారామ క్షేత్రంలో చేసిన జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన భక్తులను అలరించింది. కార్తిక మాసం సందర్భంగా ఆలయంలో లక్షపత్రి పూజలు చేసుకున్న వారికి ఆలయ దీపారాధన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేస్తారు. జ్యోతిర్లింగానికి పూజలు చేసిన భక్తులు దీపాలు వెలిగించారు. లక్షపత్రి పూజలకు అనుమతి పొందిన భక్తులు జ్యోతిర్లింగంలో దీపాలు వెలిగించారు. ఇతర భక్తులు కూడా పోటీ పడ్డారు.

భక్తిశ్రద్ధలతో ఆకాశ దీపం పూజలు



ఆకాశదీపానికి పూజలు నిర్వహిస్తున్న పండితులు

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో సోమవారం రాత్రి ఆకాశదీపాన్ని భక్తిశ్రద్ధలతో వెలిగించారు. ఆలయంలోని ధ్వజ స్తంభం వద్ద ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆకాశదీపానికి పూజలు చేశారు. భక్తులు శివనామ స్మరణతో ఆకాశదీపాన్ని ధ్వజ స్తంభం శిఖర భాగానికి తాడుతో లాగారు.

కార్తిక పౌర్ణమి ఉత్సవాలకు రెడీ

- పాదగయ క్షేత్రంలో భారీ ఏర్పాట్లు
- స్వామివారిని లక్ష మంది దర్శించుకుంటారని అంచనా
- భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు



పిఠాపురం పాదగయ క్షేత్రం

పిఠాపురం: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో ఆలయాలు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. శైవ క్షేత్రాల్లో ప్రతిరోజూ విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 15న కార్తిక పౌర్ణమి సందర్భంగా స్థానిక పాదగయ పుణ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడనుంది. సుమారు లక్ష మంది భక్తులు స్వామి వారి దర్శనానికి వస్తారన్న అంచనాలతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 14వ తేదీ రాత్రి నుంచే భక్తులు ఆలయానికి చేరుకుంటూరు. 15వ తేదీ తెల్లవారుజాము నుంచి పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేసి ఉమాకుక్కుటేశ్వర స్వామి, పురుహూతిక అమ్మవార్లను దర్శించుకుంటారు. ఈ మేరకు పాదగయ పుష్కరిణిని శుభ్రం చేయడంతో పాటు క్యూలైన్లు పటిష్టం చేస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులందరికీ స్వామి వారి దర్శనమయ్యేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కార్తిక పౌర్ణమి వ్రతాలు ఆచరించిన భక్తులు ఉదయంతో పాటు సాయంత్రం కూడా ఆలయానికి వచ్చే అవకాశాలు ఉండడంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. శుక్రవారం రాత్రి కుక్కుటేశ్వరస్వామి వారి జోలా తోరణం నిర్వహించనున్నారు.

విశేష పూజలకు ఏర్పాట్లు

"పౌర్ణమి రోజు స్వామి వారికి లక్షపత్రి పూజలు, అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. 15, 16 తేదీల్లో వేల సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చే అవకాశం ఉండడంతో దాని తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నాం. అందరికీ దర్శనం కలిగించడంతో పాటు అన్నప్రసాదాలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్, ఈఓ, పాదగయ క్షేత్రం

పౌర్ణమి పూజలతో మంచి ఫలితాలు

కార్తికమాసం హిందు పురాణాల ప్రకారం చాలా విశిష్టత కలిగి ఉంది. ఈ మాసంలో శివునికి చేసే పూజలు విశేష ఫలితాలను ఇస్తాయి. అందులోనూ కార్తిక పౌర్ణమి నాడు మహాశివునికి చేసే పూజలు కోటి రెట్లు ఫలితాలను ఇస్తాయి. అందుకే భక్తులు ఎక్కువగా కార్తిక పౌర్ణమి వ్రతాలు భక్తి శ్రద్ధలతో ఆచరిస్తారు. ఈ ఏడాది కార్తిక పౌర్ణమికి గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణా సమేత నాగేశ్వరస్వామి వారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో భారీ ఏర్పాట్లు చేస్తున్నాం."

ఆకొండి ప్రభాకరశాస్త్రి, అపర్ణాదేవి ఆలయ అర్చకులు, తాటిపర్తి,గొల్లప్రోలు మండలం

సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన



గొల్లప్రోలులో ఆందోళన చేస్తున్న కార్మికులు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీలో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కార్మికులు ఆందోళన చేశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు కె.చిన్న నందీశ్వరరావు మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్లకు పనిముట్లు కల్పించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కార్మికుల సమస్యలపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు వినతులు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. చెత్త తీసుకువెళ్లే మూడు రిక్షాలు రిపేరులో ఉన్నాయని, చెత్త తరలించే వ్యాను సెల్ఫ్ మోటర్ పోయినా పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు గ్లౌజులు, శానిటేషన్ చెప్పులు, చీపుర్లు ఇవ్వాలని, జనాభా పెరుగుదలకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలని కోరారు. కోవిడ్ కాలంలో పనిచేసిన వారికి ఆరు నెలల బకాయి వేతనాలు మంజూరు చేయాలని, చనిపోయిన బంగారు రాము కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ. 2 లక్షల సాయం ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నీలాపు ఏసమ్మ, బి.సత్యవతి, సీహెచ్‌వీ రమణ, సీహెచ్ రామారావు, రాజు సింహాచలం, దివ్యవాణి తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

కొత్తపల్లి: కోడి పందేల శిబిరంపై దాడి చేసి ఐదు మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సోమవారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని కొమరగిరిలో కోడిపందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై వెంకటేష్ తన సిబ్బందితో దాడి చేశారు. కోడి పందేలు ఆడుతున్న వారు పరారీ కాగా సంఘటన స్థలంలో ఉన్న ఐదు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం జవహర్‌లాల్ నెహ్రూ జీవిత చరిత్ర విశేషాలు, స్వతంత్ర్య ఉద్యమంలో నెహ్రూ పాత్ర అనే అంశంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బాలల దినోత్సవం రోజు బహుమతులు అందజేస్తామని సీఐటీయూ నాయకుడు నందీశ్వరుడు తెలిపారు. కార్యక్రమంలో కె.కుమార్, హరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరు పోస్టర్ ఆవిష్కరణ

పెద్దాపురం: ప్రజా సమస్యలపై జరుగుతున్న ప్రజా పోరును విజయవంతం చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్టీ మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతి కుమార్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాయకులు నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, చల్లా విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- ఆర్డీఓ శ్రీరమణి
- గ్రీవెన్స్‌కు 11 అర్జీలు



అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ శ్రీరమణి అన్నారు. ప్రతి వారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి వివిధ సమస్యలపై 11 అర్జీలు అందినట్టు ఆమె తెలిపారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి, సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఉద్దేశంతో డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆయా శాఖల మండల స్థాయి అధికారులు పీజీఆర్ఎస్‌కు అందుబాటులో ఉంటారన్నారు. గ్రీవెన్స్‌కు వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారిపై ఉంటుందన్నారు. ఈ వారం అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సరిత, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణ శాఖ అధికారి రవిశంకర్, డీవైఈఓ శర్మ, చప్పిడి రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆజాద్ సేవలు చిరస్మరణీయం

నవోదయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య



ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు

పెద్దాపురం: దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా సేవలందించిన మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిరస్మరణీయులని పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య అన్నారు. ఆజాద్ జయంతిని పురస్కరించుకుని సోమవారం నవోదయ విద్యార్థులు జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణయ్య మాట్లాడుతూ, 1947 నుంచి 1958 వరకు కేంద్ర విద్యా శాఖ మంత్రిగా దేశానికి సేవలందించిన ఆజాద్.. విద్యా పరంగా అనేక సంస్కరణలు తెచ్చారన్నారు. వీటికి గుర్తుగా ఆయన జయంతి రోజును విద్యా దినోత్సవంగా ప్రకటించినట్టు చెప్పారు. ఐఐటీ, యూనివర్సిటీల స్థాపన ఆయన ఆశయంతో సాధించినవేనన్నారు. తొలుత ఆజాద్ చిత్రపటానికి పూల మాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ ఎన్‌సీసీ ఆఫీసర్ సనపల సత్యనారాయణ, జీవీ పాపారావు, వి.జగన్‌మోహనరావు, వి.ప్రేమలత, డి.అప్పారావు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజికాభివృద్ధికి విద్యే దోహదం

సామర్లకోట: ప్రతి వ్యక్తి సామాజికంగా అభివృద్ధి సాధించడానికి విద్య ఎంతో దోహదపడుతుందని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా భారత రత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. తొలి కేంద్ర విద్యా శాఖ మంత్రిగా ఆజాద్ విశేష సేవలందించారన్నారు. జాతీయ నాయకుల జీవిత చరిత్రలపై విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. విద్యను మించిన సంపద మరొకటి ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.రాజు, కేవీవీ సత్యనారాయణ, కె శ్రీనివాసు, శ్రీవలి, డీవీఆర్ఎస్ వల్లీ, ఎంవీ సత్యనారాయణ, పి.బ్రహ్మానందం, బేబీరాణి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలమం వద్ద ఆందోళన చేస్తున్న లిబరేషన్ శ్రేణులు

కొత్తపల్లి: పేదలకు ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, జాబ్ కార్డులు ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు గొడుగు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలమం వద్ద లిబరేషన్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం, అఖిల భారత ప్రగతి శీల మహిళ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో ర్యాలీ చేశారు. అనంతరం తహసీల్దార్ చిన్నారావుకు వినతి పత్రం అందించారు. ఇళ్ల పట్టాలిచ్చిన వారికి, ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకున్న వారికి స్థలాలు చూపించాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. లిబరేషన్ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు శీలం అప్పలరాజు, మండల కమిటీ సభ్యులు రాజేష్, సోని, మహాలక్ష్మి పాల్గొన్నారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలోని పుష్కరిణిలో కార్తిక దీపాలు వదులుతున్న భక్తులు



పాదగయ క్షేత్రంలో శివలింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు



ఉప్పాడలో రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

హరహర మహాదేవ..

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- మార్మోగిన శివనామస్మరణ
- గ్రామాల్లో కార్తిక వన సమారాధనలు



భక్తులతో కిటకిటలాడుతున్న పాదగయ క్షేత్రం

పిఠాపురం: కార్తికమాసంలో రెండో సోమవారం కావడంతో పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేలాది మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం పలు ఆలయాల వద్ద వనసమారాధనలు నిర్వహించారు. స్థానిక పాదగయ పుణ్యక్షేత్రానికి భక్తులు పోటెత్తారు.

తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని ఉమాకుక్కుటేశ్వర స్వామి, పురుహూతిక అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలోని దత్తాత్రేయ కల్యాణ మండపంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. స్వామి వారికి లక్షపత్రి పూజలు, అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆలయాలు కిటకిట

పిఠాపురం పట్టణంలోని సోమేశ్వరస్వామి, సకలేశ్వరస్వామి ఆలయాల్లో అధికారులు ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పిఠాపురం మండలం భోగాపురం, పి.దొంతమూరు, చిత్రాడ, విరవాడ, మల్లాం, రాయవరం, గొల్లప్రోలు మండలం దుర్గాడ రామలింగేశ్వరస్వామి, తాటిపర్తి అపర్ణాదేవి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేయడంతో పాటు పలు రకాల పండ్లు, పూలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రారంభం నుంచి రద్దీ

పాదగయ క్షేత్రాన్ని కార్తిక మాసం ప్రారంభం నుంచి ప్రతిరోజూ వేల సంఖ్యలో భక్తులు దర్శిస్తున్నారు. పిఠాపురం పరిసర ప్రాంతాల నుంచే కాకుండా సుదూర ప్రాంతాల వారు సైతం ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. దీంతో పట్టణంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

ప్రత్యేక పూజలు, అభిషేకాలు

కొత్తపల్లి: కార్తిక మాసంలో రెండో సోమవారం కావడంతో గ్రామాల్లో ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక బాలా త్రిపుర సుందరీ సమేత రాజశేఖరస్వామి , రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి, శ్రీధర్మ శాస్తా, ఉప్పాడలోని చౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, మత్స్యలింగేశ్వర స్వామి ఆలయాలతో పాటు మూలపేట, గోర్స తదితర గ్రామాల్లోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు రావిచెట్టు, ధ్వజస్తంభాల వద్ద కార్తిక దీపాలు వెలిగించారు. కొత్తపల్లిలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మహిళలు విష్ణుపారాయణ చేశారు.



ఉప్పాడలో స్వామివారికి హారతి ఇస్తున్న పండితుడు



విశేష అలంకారంలో తాటిపర్తి నాగేశ్వరస్వామి వారు

శివాలయాల్లో భక్తుల కిటకిట

- కార్తిక దీపాలు వెలిగించిన మహిళలు
- స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

సామర్లకోట: కార్తిక మాసం రెండో సోమవారం కావడంతో పంచారామ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి భక్తులు ఉచిత, రూ.20, రూ.50, రూ.100 క్యూలైన్లలో బారులు తీరారు. స్వామివారికి తొలి అభిషేకం, తొలి పూజలను పిఠాపురం మహారాజా గోత్రనామాలలో నిర్వహించారు. కార్తిక మాసంలో పంచారామ క్షేత్రంలో దీపాలు వెలిగిస్తే పుణ్యం వస్తుందని నమ్మకం. ఈ నేపథ్యంలో స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వర ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలోని కాల భైరవ స్వామి, ధ్వజ స్తంభం, రావిచెట్టు, జమ్మి చెట్టు, తులసీ చెట్ల వద్ద ఆలయ ప్రాంగణంలోను భక్తులు ఉదయం, రాత్రి వేళల్లో దీపాలు వెలిగించారు. కార్తిక మాసం రెండో సోమవారం కావడంతో అనేక మంది భక్తులు ఉపవాస దీక్ష చేశారు. సాయంత్రం స్వామి వారిని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప దర్శించుకుని పూజలు చేశారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆయనకు స్వామివారి ఫొటో, ప్రసాదం అందజేశారు, తెల్లవారుజామున 4 గంటల నుంచి భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు. గోవును ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించి, గోపూజ నిర్వహించారు. స్వామివారి దర్శనానికి అనుమతి ఇచ్చిన వెంటనే భక్తుల శివ నామస్మరణతో ఆలయం మార్మోగింది. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని అనేక మంది భక్తులు శివమాల, అయ్యప్ప మాల ధరించారు. భక్తులు ఆలయ ధ్వజ స్తంభం సమీపంలో ఉన్న శివలింగానికి స్వయంగా అభిషేకాలు చేశారు. ఆలయ ఈఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాదాన్ని స్వీకరించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పట్టణ సీఐ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెద్దాపురం అగ్నిమాపక కేంద్రాల ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. సుమారు 25 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఈఓ భళ్ల నీలకంఠం తెలిపారు. ఈఓ ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్, సన్నిధిరాజు వెంకన్న, అంజిబాబు, భాస్కర్, కుమార్ చెరుకూరి రాంబాబు పూజాదికాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు, మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు చల్లా సత్తిబాబు, మలిరెడ్డి శ్రీను, భక్తులకు సేవలందించారు. సాయంత్రం స్వామి వారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా స్థానిక ఐదు తూముల వద్ద ఉన్న అన్నపూర్ణ సమేత వేణుగోపాలస్వామి, చౌడేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి, పాత సామర్లకోటలోని బాలాత్రిపుర సుందరి సమేత చంద్రశేఖరస్వామి ఆలయాల్లోను భక్తులు స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు.



పంచారామ క్షేత్రంలో స్వామివారికి తొలిపూజ



ప్రత్యేక అలంకరణలో స్వామివారు